క్లుప్తంగా

సోలార్ కార్మికులకూ బోనస్ ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించిన విధంగా సోలార్ కార్మికులకు బోనస్ చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సింగరేణి డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేసింది. సంఘం జిల్లా నాయకుడు నబీ మాట్లాడుతూ... సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లించిన సంస్థ సోలార్‌లో పనిచేస్తున్న కార్మికులను విస్మరించటం తగదన్నారు. ఇతర రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేసిన సింగరేణి సోలార్ కార్మికులను అదే తరహాలో ఆదుకోవాలని కోరారు. తాళ్లూరి కృష్ణ, ప్రేమ్‌సింగ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

సుజాతనగర్: నాలుగేళ్లుగా పాత అంజనాపురంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేద గిరిజనులకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో పాత అంజనాపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీర్ల రమేష్, తిరుపతిరావు, గండమాల భాస్కర్ ఉప్పెర్ల ప్రశాంత్, నాగమణి, కళావతి, బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న రవికుమార్

పాల్వంచ: ప్రభుత్వం అందిస్తున్న మైనార్టీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు కల్లోజి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మెర్సీ ప్రార్థనా మందిరంలో జరిగిన ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ.. పెడతోవలో నడుస్తున్న అనేక మందిని సన్మార్గంలో నడిపే శక్తి బైబిల్‌కు ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్ జాన్ విల్సన్, దయాకర్, సుష్మ, విక్టర్ వందనం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన ఎమ్మెల్యేలు


సంతాపం తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ మాతృమూర్తి కల్లోజి జయమ్మ అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, నాయకులు నాగసీతారాములు, తూము చౌదరి, కోనేరు సత్యనారయణ, వనమా రాఘవేంద్రర్‌రావు, ఎస్‌కే సాబీర్‌పాషా హాజరై జయమ్మ మృతదేహం వద్ద సంతాపం తెలిపారు.

చేతిపంపునకు మరమ్మతులు చేయాలి


చేతిపంపును చూపిస్తున్న నాయకులు

సుజాతనగర్: స్థానిక అంబేద్కర్‌నగర్‌లో మరమ్మతులకు గురైన చేతిపంపుకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఐక్యవేదిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మరమ్మతులకు గురైన చేతిపంపు వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు వేల్పుల భాస్కర్ మాట్లాడారు. చేతి పంపు పనిచేయక నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేసుపాక వెంకటేశ్వర్లు, మీరాబి, మంద చంటి, పవన్, శ్రీను, గుర్రం పవన్, గోపి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందు: రావణవధ


జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేసిన వేడుకలను తిలకిస్తున్న ప్రజలు


కొత్తగూడెం రైటర్‌బస్తీలో రావణదహనం చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఘనంగా దసరా వేడుకలు


ఇల్లెందు: జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మహిళా కౌన్సిలర్లు


కొత్తగూడెం: భజనమందిరం ఏరియాలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు


జూలూరుపాడు: గుండెపుడిలో అన్నదానం


టేకులపల్లి: అమ్మవారిని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


పోలీసుస్టేషన్‌లో ఆయుధపూజ చేస్తున్న ఎస్ఐ సురేష్


జూలూరుపాడు: వేలంలో లడ్డూను సొంతం చేసుకున్న రాధాకృష్ణ, సుప్రజ దంపతులు

కొత్తగూడెంటౌన్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగను జరుపుకుంటామని, అందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం రైటర్ బస్తీలో జరిగిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కాంగ్రెస్ నాయకులు నాగసీతరాములు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడారు. సాయంత్రం కొత్తగూడెం రైటర్‌బస్తీ, రామవరం ప్రాంతాల్లో రావణదహనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సుజాతనగర్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన మండపం చివరిరోజు శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన శమీ పూజల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, నాయకులు బొడ్డు కేశవరావు, తాళ్లూరి పాపారావు, బొడ్డు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద నవరాత్రులు ముగిసిన సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. అనంతరం పూజా వస్తువులు, లడ్డు, అమ్మవారి పట్టు వస్త్రాలకు వేలం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చలవాది ప్రకాష్, సంపత్‌కుమార్, కిషోర్, జయకర్‌రెడ్డి, శివ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: విజయదశమి పర్వదినాన్ని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా జరుపుకున్నారు. జూలూరుపాడు శ్రీసీతారామాలయం, పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం, శ్రీకోటమైసమ్మతల్లి ఆలయం, కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయం, వెంగన్నపాలెం టీచర్స్ కాలనీ, వెంగన్నపాలెం, సురారం శ్రీసీతారామాలయాల్లో, అన్నారుపాడు, గుండెపుడి, రామచంద్రాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో తొమ్మిది రోజులుగా ఎంతో వైభవంగా జరిగిన శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లోని మండపాల వద్ద ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద దంపతులతో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని సీఐ ఇంద్రాసేనారెడ్డి, పాపకొల్లు శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయంలో ఎస్ఐ రాణాప్రతాప్‌లు ప్రారంభించారు. అనంతరం అమ్మవారి లడ్డును వేలంపాటలో రూ.21,600లకు అనుమళ్ల రాధాకృష్ణ, సుప్రజ దంపతులు దక్కించుకున్నారు. అమ్మవారి విగ్రహాలను ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు.

టేకులపల్లి: దసరా పండుగ వేడుకలు టేకులపల్లి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి రామాలయం సెంటర్, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వీధిలో, తెలుగూరు, బోడు, కోయగూడెం గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద బాణసంచా కాలుస్తూ, ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. టేకులపల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పోగుల సురేష్, బోడు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పాడిశెట్టి శ్రీకాంత్‌లు ఆయుధ పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తులు జమ్మి చెట్టుకు పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు.


టేకులపల్లి: రామాలయంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు


కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలో రావణదహనం కార్యక్రమానికి హాజరైన ప్రజలు..


కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో జమ్మిపూజ


టేకులపల్లిలో అమ్మవారి ఊరేగింపులో యువకుల సందడి

మూగబోయిన ప్రజాగళం


వంగపండు, గద్దర్, గోరేటి వెంకన్నలతో కళా ప్రదర్శనలో రడం శ్రీను (ఫైల్)

ఇల్లెందురూరల్: చిరుప్రాయం నుంచి ప్రజాసమస్యలపై వినిపించిన గళం మూగబోయింది. రేపల్లెవాడ గ్రామానికి చెందిన రడం శ్రీను పేదరికం కారణంగా చదువుకు దూరమై పెంకు పరిశ్రమలో పనిచేసేవాడు. ఆ తరువాత కొమరారం ప్రాంతానికి వలస వచ్చిన ఆయన న్యూడెమోక్రసీలో చేరి ప్రజాసమస్యలపై తన గళం విప్పాడు. క్రమంగా న్యూడెమోక్రసీ అనుబంధ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వారా అనేక కళాప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం రగిలించారు. విప్లవ కళాకారులు వంగపండు, గద్దర్‌లతోపాటు అనేక మంది మహామహులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా విప్లవ గీతాలు వినిపించాడు. పాటలు రాయడం, పాడటంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ బొగ్గుట్ట గద్దర్‌గా పేరు సంపాదించిన రడం శ్రీను తీవ్ర అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పీపుల్స్‌వార్ మావోయిస్టుగా రూపాంతరం చెందిన నాటి నుంచి పోలీసు నిర్బంధాలు అధికం కావడంతో కొంతకాలం అజ్ఞాత జీవితాన్ని గడిపాడు. ఈ సమయంలోనే ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంటివద్దే ఉంటూ ప్రజాఫ్రంట్‌లో చేరి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. శ్రీను మృతి విషయం తెలుసుకున్న విప్లవపార్టీల శ్రేణులు భారీ సంఖ్యలో కొమరారం చేరుకున్నారు. నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సాయిబాబా మరణం విప్లవోద్యమానికి లోటు


మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): ప్రొఫెసర్ సాయిబాబా మరణం అనే మాటున చంపబడ్డారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ నాయకుడు పెద్దబోయిన సతీష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వామపక్ష విప్లవ మేధావిగా ఉన్నందుకు ఆయనను అక్రమ కేసుల్లో ఇరికించారని, వికలాంగుడు అని కనికరించకుండా మోదీ, షా ప్రభుత్వం అత్యంత కర్కశంగా జైల్లో నిర్బంధిచి ఆయన మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. సాయిబాబా రచయిత, అట్టడుగు పొరల్లో నుంచి ఎదిగిన ప్రజాగొంతు మరణించటం విషాదకరమని, విప్లవ జోహార్లు తెలిపారు.

టేకులపల్లి: పౌరహక్కుల నేత, విప్లవ మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం భారత విప్లవోద్య మానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దుబాకుల అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంతాప కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రామచందర్, బానోతు వెంకట్రాం, ఎట్టి నరసింహారావు, ధరావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సాయిబాబా మృతికి మతోన్మాద బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆయన త్యాగం వృథా కాదని, త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలు పురుడు పోసుకుంటాయని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మెంతెన ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

జూలూరుపాడు: ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004-2005 విద్యా సంవత్సరంలో వశిష్ఠ విద్యాలయంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. ఉపాధ్యాయులతో తమ అనుబంధాన్ని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం నాగరాజు, రాజకుమారి, కోటేశ్వరరావులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సపావట్ నరేష్, చిన్నజాను, సేవియ్యా, వెలగా శ్రీకాంత్, సాయి, లక్ష్మీనారాయణ, బాలాజీ, దీపిక, రాధిక తదితరులు పాల్గొన్నారు.

బైక్ డ్రా విజేత రమాదేవి

పాల్వంచ: పట్టణంలోని ఓ వస్త్ర దుకాణం డ్రాలో రమాదేవి విజేతగా నిలిచింది. దసరా మహోత్సవాల్లో భాగంగా దుస్తులు కొనుగోలు చేసిన వారికి కూపన్లు అందించారు. ఇందులో భాగంగా మోటర్ సైకిల్‌ను బహుమతిగా ప్రకటించారు. ఆదివారం డ్రా తీయగా విజేతగా రమాదేవి ఎంపికయింది.

చర్యలు తీసుకోండి..

జూలూరుపాడు: ఏన్కూర్ మండలానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ భూక్యా సాగర్ ఆత్మహత్యకు పాల్పడటానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొంతమంది పోలీస్ అధికారులు గంజాయి కేసులో ఇరికించి, అవమానాలకు గురిచేయడం కారణంగా మనస్తాపంతో పురుగు మందుతాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి, హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాగర్ చెందినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ప్లాంట్‌లు నిర్మించాలి


మాట్లాడుతున్న రాజుగౌడ్

పాల్వంచ: పాల్వంచలో అభివృద్ధి కుంటుపడిపోతోందని, తొలగించిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం స్థానంలో మరో 800 మెగావాట్ల రెండు పవర్ ప్లాంట్‌లను నిర్మించాలని పవర్ ప్లాంట్‌ల సాధన కమిటీ నాయకులు మంతపురి రాజుగౌడ్, మహిపతి రామలింగం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వజ్రా హోటల్ సమావేశం మందిరం విలేకరులతో మాట్లాడారు. పాల్వంచలో పాత ప్లాంట్ తీసేయడం వల్ల సుమారు రెండు వేలమంది ఉద్యోగులు తరలిపోయారని, తద్వారా పాల్వంచ అభివృద్ధి ఎక్కడిక్కడ మందగించిందన్నారు. వర్తక, వాణిజ్యం, రియల్‌ఎస్టేట్ దెబ్బతిందన్నారు. ఎక్కడ చూసినా ఇళ్లకు టూలెట్ బోర్డులు, ఇళ్ల అమ్మకాలు పెట్టడం అత్యంత బాధాకరం అన్నారు. లాయర్ శివరాం ప్రసాద్, డాక్టర బిక్కసాని సుధాకర్, ఎర్రగుంట సాంబశివరావు, లక్ష్మీపతి, సైదులు, ఎస్‌వీఆర్‌కె. ఆచార్యులు, సీహెచ్.రమేష్, తోట కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో ముగిసిన జాతర


ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఇల్లెందురూరల్: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేట కోటమైసమ్మ జాతర శనివారం ముగిసింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు వాహనాలకు, రైతులు ఆయుధ పూజలు చేశారు. జాతరలో పలువురిని అమ్మవారి ఆవహించడంతో వారి నోటి వెంట వచ్చే పలుకులను భక్తులు ఆసక్తిగా ఆలకించారు. సమీప ప్రాంత ప్రజలు భారీగా తరలివచ్చి జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా విడిది ఏర్పాటు చేసుకోవడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

జేఏసీ కన్వీనర్‌గా సురేందర్‌రావు


మాట్లాడుతున్న లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి: టేకులపల్లి మండల రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్‌గా బేతంపూడి సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం లక్కినేని నివాసంలో వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కినేని మాట్లాడుతూ... రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై జేఏసీగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ నేపథ్యంలో జేఏసీగా ఏర్పడటం శుభపరిణామమని చెప్పారు. కోయగూడెం ఎల్ఎస్ఎస్‌ఓబీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేదంటే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూక్యా దళ్‌సింగ్‌నాయక్, దుబాకుల ప్రసాద్, బానోతు ఊక్లా, బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, బి.ఈరు, డి.కృష్ణ, జరుపల సుందర్, మాలోత్ శివనాయక్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, కల్తీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో భక్తుల ఇక్కట్లు


పెద్దమ్మగుడి వద్ద వాహనాల రద్దీ

పాల్వంచరూరల్: దసరా పండగ సందర్భంగా శనివారం పెద్దమ్మతల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద బీసీఎం జాతీయ రహదారిపై వాహన రాకపోకలు ఒకవైపు, దసరా సందర్భంగా వాహనాల పూజల కోసం రోడ్డుకు ఒకవైపున బారులు తీరిన వాహనాల కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌తో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటు ఆలయ ఈఓ, అటు పోలీసులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆలయం ఎదుట రోడ్డు మీద పూజ కోసం వచ్చిన బైక్‌లతోపాటు భారీవాహనాలు పూజకు ళ్లి తిరిగి బయటకు వచ్చే క్రమంలో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో భక్తులుఇబ్బందులు పడ్డారు.

డీజే సౌండ్‌తో మరింత ఇబ్బంది...

శనివారం ఆలయం వద్ద నిర్వహించిన శమీపూజ కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని దేవాలయం నుంచి ప్రధాన రహదారి దుగా జమ్మి చెట్టు వరకు తీసుకళ్లేందుకు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో సంస్కృతి సంప్రదాయాలకు ఎండోమెంట్ శాఖ ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా మంగళవాయిద్యాలతో అమ్మవారిని తోడ్కొని జమ్మి చెట్టు వద్దకు తీసుకెళ్లాల్సి ఉండగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా ఎన్నడూలేనంతగా దద్దరిల్లిపోయింది. వచ్చిన భక్తులతోపాటు వృద్ధులు, వివిధ ఆరోగ్య సమస్యలున్నవారు డీజే సౌండ్స్‌తో తీవ్ర ఆందోళన చెందారు. పోలీసులు వైపు డీజేల నిషేధించగా దేవాదాయశాఖకు చెందిన ఈ కార్యక్రమంలో డీజే ఉపయోగించడం విమర్శలకు దారితీసింది.